

5

ఆలోచనలే మనిషి
అసలు ముఖం


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3 సంచిక -97 బుధవారం 16 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# యూపీఐ బాదుడు!



రూ. 2వేలు దాటితేయూపీఐ లావాదేవీలపై

త్వరలో చార్జీల వసూలుకు కేంద్రం సన్నద్ధం

బ్యాంకర్లతో కమిటీ ఏర్పాటు



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 15:(జర్నలిస్ట్ వార్త);**యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే పలు డిజిటల్ చెల్లింపులపై ఇప్పటివరకు ఉన్న ఉచిత విధానానికి మోడీ సర్కార్ స్వస్తి చెప్పాలని నిర్ణయించింది. రూ.2,000 కంటే తక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలకు ఎటువంటి చార్జీలు ఉండవని చెబుతున్నప్పటికీ.. అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే వ్యాపార చెల్లింపులపై (పీ2ఎం), మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ప్రాసెసింగ్ **మిగతా 2లో...**

నాడు.. వినియోగదారులపై ఎలాంటి భారాలు పడవంటూ జీఎస్టీని తెరపైకి తెస్తున్నప్పుడు మోడీ సర్కార్ బుకాయించింది. అంతా ఉత్పత్తి చేసే కంపెనీ యాజమాన్యమే భరిస్తుందనటంతో దేశ ప్రజలు గుడ్డిగా నమ్మారు. కానీ జరిగిందేంటీ..? యాజమాన్యంతో కేంద్రం లాలూచీ పడింది. జీఎస్టీ భారమంతా వినియోగదారుని నెత్తిన రుద్దేసింది. అచ్చం అదే విధంగా ఇప్పుడు యూపీఐ లావాదేవీలపైనా కేంద్రం ఇలాంటి ఎత్తుగడే వేస్తున్నది. డిజిటల్ చెల్లింపుల రూపంలో వేలకోట్ల లావాదేవీలు జరుగుతుండడంతో.. వినియోగదారులను బాదేసి ఖజానా నింపుకుందామనే ఆలోచన చేసింది. ఉపాధి, ఆదాయాల్లేక నానా ఇబ్బందులు పడుతున్న జనాన్ని పీల్చిపిప్పి చేసేలా చార్జీల భారాన్ని అమల్లోకి తేనున్నది. మరోవైపు ఈ నిర్ణయం అమెరికా ఒత్తిడి మేరకే చేపడుతున్నట్టు స్పష్టమవుతోంది.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రిని పునరుద్ధరించండి టూరిజం, ఎడ్యుకేషన్ రంగాల్లో సహకరించండి

: ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి ఆహ్వానం

తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్ లో ప్రిన్స్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీప్రభుత్వ సేవలు పొందండి



**హైదరాబాద్ సెప్టెంబర్ 15:(జర్నలిస్ట్ వార్త);**
భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో ముఖ్యమంత్రి **మిగతా 2లో...**

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు..

ఈనెల 22న ఓటర్ల జాబితా

41 పట్టణ స్థానిక సంస్థలకు ఓటర్ల జాబితాల రూపకల్పనకు ఆదేశాలు

ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను ప్రచురించనున్న ఎన్నికల సంఘం

2026 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎస్ఈసీ

ఇటీవలే 59 మున్సిపాలిటీలకు కూడా ఇదే తరహా నోటిఫికేషన్ జారీ

2లో.



## పరస్పర సున్నితత్వం పాటించాలి

: జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ



శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం మిగతా 2లో...

## (ఏపీపీఎస్సీ) 892 పోస్టుల నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు భారీ ఊరట..

892 పోస్టుల భర్తీ.. గ్రూప్-1 సహా నోటిఫికేషన్ల విడుదల!

గ్రూప్-1లో 163 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

11 డిప్యూటీ కలెక్టర్లు, 36 డీఎస్పీ ఉద్యోగాల భర్తీ

**అమరావతి(జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఉద్యోగార్థులకు బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలోని 20 విభిన్న ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న మొత్తం 892 పోస్టుల భర్తీకి అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగానే కీలకమైన గ్రూప్-1 సర్వీసులలో 163 పోస్టులు సహా వివిధ విభాగాల్లో **మిగతా 2లో...**




## 22ఏపై నేడు సీఎం కీలక ప్రకటన

అసెంబ్లీలో ప్రసంగించనున్న రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 15(జర్నలిస్ట్ వార్త);**
అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం పది గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెక్షన్ 22ఏ అంశంపై చర్చ కొనసాగుతుందని అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి మంగళవారం తెలిపారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం చర్చను ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై **మిగతా 2లో...**



## 5 లక్షల ఇళ్లు మంజూరు

తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక..
అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు

ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు

తెలంగాణకు 2 లక్షల ఇళ్లు

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం

త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక




2లో.

## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు..





పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు

కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన చంద్రబాబు

రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

**తిరుమల సెప్టెంబర్ 15(జర్నలిస్ట్ వార్త);**
కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.వారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై **2లో...**

## నా పీఆర్‌ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు

సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్

పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్

రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు



**హైదరాబాద్ సెప్టెంబర్ 15:(జర్నలిస్ట్ వార్త);**
హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్‌ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని.. **మిగతా 2లో...**

# యూపీఐ బాదుడు!

**మొదటి పేజీ తరువాయి**

చార్జీలను ప్రవేశపెట్టేందుకు చట్టపరమైన మార్గం సుగమం చేస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి పార్లమెంటులో ఇటీవల 'టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు-2026' ద్వారా 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007'లోని సెక్షన్ 10ఎకు సవరణ చేశారు. దీని ప్రకారం రూ.2,000 వరకు చేసే యూపీఐ, రూపే డెబిట్ కార్డ్ చెల్లింపులకు ఎలాంటి చార్జీలు వర్తించవు. అయితే ఈ పరిమితిని దాటిన వ్యాపార లావాదేవీలపై చార్జీలు విధించేందుకు వెసులుబాటు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, వివిధ సంఘాల ప్రతినిధులతో కూడిన 22 మంది సభ్యుల 'యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ' త్వరలోనే సమావేశమై తుది నిర్ణయం తీసుకోనుందని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం దేశంలో 55 కోట్లకు పైగా ప్రజలు యూపీఐని ఉపయోగిస్తున్నారు. జులై 2026 ఒక్క నెలలోనే ఏకంగా 2,366 కోట్ల లావాదేవీలు జరిగి రూ. 29.9 లక్షల కోట్ల విలువైన బదిలీలు నమోదయ్యాయి.

**ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ : కాంగ్రెస్**

రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు లేదా ఎండీఆర్ విధించడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా పేమెంట్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్ర మోడీ భారత్‌లోని జీరో ఎండీఆర్ విధానాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. యూపీఐ లావాదేవీల పరిమాణం పరంగా రూ.2,000 దాటినవి కేవలం 5 శాతమే అయినప్పటికీ.. మొత్తం లావాదేవీల విలువలో అవి దాదాపు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయని రాహుల్ గాంధీ వెల్లడించారు. వినియోగదారుల నుంచి నేరుగా చార్జీలు వసూలు చేయకపోయినా.. వ్యాపారులు ఈ భారాన్ని చివరికి పెరిగిన ధరల రూపంలో సాధారణ ప్రజల పైనే రుద్దుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందని, ఇప్పుడు డిజిటల్ చెల్లింపుల పన్ను పేరుతో ప్రజల పొదుపును హరిస్తున్నారని మండిపడ్డారు. రూ.5,000 లావాదేవీలపై రూ.25, రూ.10,000 లావాదేవీలపై రూ.50 వరకు అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించక పోగా మోడీ ప్రభుత్వం ప్రజల జేబులు ఖాళీ చేయడానికి కొత్త మార్గాలను వెతుకుతోందని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ఏదైనా ఎండీఆర్ వర్తిస్తే అది కేవలం నిర్దిష్ట వర్గానికి చెందిన పెద్ద వ్యాపార లావాదేవీలపై మాత్రమే ఉంటుందని.. వినియోగదారులు నేరుగా ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని మంత్రి సీతారామన్ పేర్కొన్నారు.

**గూగుల్‌పే, ఫోన్‌పేకు భారీగా లబ్ధి**

భారతదేశపు యూపీఐ మార్కెట్‌లోనూ అమెరికా సంస్థలైన గూగుల్ పే, వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫోన్‌పే ఇప్పటికే 80 శాతానికి పైగా లావాదేవీలను నియంత్రిస్తున్నాయి. ఏ ఒక్క యాప్ కూడా 30 శాతానికి మించి మార్కెట్ వాటా కలిగి ఉండకూడదన్న ఎన్‌పీసీఐ నిబంధనను కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీంతో ఈ నిబంధన అమలును ప్రభుత్వం డిసెంబర్ 2026 వరకు వాయిదా వేస్తూ వచ్చింది. దీనికితోడు డేటా లోకలైజేషన్ నిబంధనలను కూడా అమెరికా కంపెనీలు తప్పుబడుతున్నాయి.భారత ప్రజాధనంతో నిర్మితమైన డిజిటల్ మౌలిక సదుపాయాలలో విదేశీ కంపెనీలు ఇంతటి ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నప్పటికీ.. అమెరికా మాత్రం తమ వీసా, మాస్టర్‌కార్డ్ కంపెనీల లాభాల కోసం భారత్‌పై ఒత్తిడి పెంచుతూనే ఉంది. అమెరికా వాణిజ్య ఒత్తిళ్లకు తలొగ్గి ఉచిత సేవలకు స్వస్తి పలకడం లేదా నిబంధనలను సడలించడం భారత డిజిటల్ సార్వభౌమత్వానికి మంచిది కాదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా ఒత్తిళ్లకు కాకుండా భారత వినియోగదారులు, వ్యాపారులు, బ్యాంకులు, ఎన్‌పీసీఐ ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర విధానాలు ఉండాలని సూచిస్తున్నారు.ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకోండి

**రూ.2,000 దాటితే 0.4 శాతం చార్జీలు**

**గరిష్టంగా రూ.300 వరకు వసూలు**

భారతదేశంలో కోట్లాది మంది వినియోగిస్తున్న యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటివరకు పూర్తిగా ఉచితంగా కొనసాగుతున్న యూపీఐ లావాదేవీల విధానంలో కీలక మార్పులు చేస్తూ ఎన్‌పీసీఐ మంగళవారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం రూ.2,000 కంటే ఎక్కువ మొత్తంలో జరిగే వ్యాపార చెల్లింపులపై 0.4 శాతం మేర మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తించనుంది. ఈ కొత్త నిబంధనలు వచ్చే నెల అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. రూ.2,000 దాటిన వ్యక్తి నుంచి వ్యాపారికి (పీ2ఎం) చెల్లింపులపై మాత్రమే ఎండీఆర్ చార్జీలు వర్తిస్తాయని ఎన్‌పీసీఐ తెలిపింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే (పీ2పీ) లావాదేవీలపై చార్జీలుండవు.

యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు టర్నోవర్ కలిగిన చిన్న వ్యాపారులకు ఈ చార్జీల నుంచి పూర్తి మినహాయింపునిచ్చారు. అలాగే రూ.2,000 లోపు ఉండే అన్ని వ్యాపార చెల్లింపులు, రూపే డెబిట్ కార్డ్ లావాదేవీలు కూడా యథావిధిగా ఉచితంగానే జరగనున్నాయి. ఒకవేళ లావాదేవీల విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే ఎండీఆర్‌ను గరిష్టంగా రూ.300కు పరిమితం చేశారు. కొన్ని ప్రత్యేక రంగాలకు భిన్నమైన విధానాన్ని ప్రకటించారు. రైల్వేలు, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధన రంగాలు, వ్యవసాయ ముడి సరుకులకు సంబంధించి రూ.2,000 దాటిన లావాదేవీలపై శాతం లెక్క కాకుండా కేవలం రూ.5 ఎండీఆర్ వసూలు చేస్తారు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీస్, స్టాక్ బ్రోకర్ల చెల్లింపులకు గరిష్టంగా రూ.300 వరకు పరిమితం చేస్తూ కేవలం 0.02 శాతం మాత్రమే ఎండీఆర్ విధించనున్నారు. వసూలైన ఎండీఆర్‌లో 5 శాతాన్ని చిన్న వ్యాపారుల్లో డిజిటల్ సేవలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక నిధిగా కేటాయించనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

# 22ఏపై నేడు సీఎం కీలక ప్రకటన

**మొదటి పేజీ తరువాయి**

చర్చ జరిగినట్టు తెలిసింది. 22ఏ నిషేధిత జాబితా వల్ల సామాన్య ప్రజలకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసే అవకాశమున్నది. ఉద్దేశపూర్వకంగానే ప్రజల భూములు, ఆస్తులను 22ఏ పరిధిలో చేర్చినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో స్పందించే అవకాశమున్నది. ప్రతిపక్షాలకు సమాధానం చెప్తారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారు, ఏం ప్రకటన చేస్తారనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. 22ఏ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఏమైనా ఉపశమనం కలుగుతుందా?అన్నదాని కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు ధరణి పోర్టల్‌లో లోపాల వల్ల బీఆర్‌ఎస్ హయాంలో భారీగా భూదందాలు జరిగాయనే దానిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరించనున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మాజీమంత్రి హరీశ్‌రావు, అతని మామ భూబదలాయింపులను ప్రోత్సహించిన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్ నేతల అక్రమ భూదందాలపై విచారణకు అదేశించే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది. ఇప్పటికే ధరణి అక్రమాలపై సెట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ధరణిపై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించింది. ఆ నివేదికను ఇంకా బహిర్గతం చేయలేదు. దీనిపైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. దీంతో అందరి చూపు బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశాలపైనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. 22ఏ అంశంపై చర్చ ముగిసిన అనంతరం ఎల్‌నినో ప్రభావంపై లఘు చర్చ ఉంటుందని అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి తెలిపారు

# ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు..

**అమరావతి సెప్టెంబర్ 15:(జర్నలిస్ట్ వార్త);**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ పరిధిలో రాష్ట్రంలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ సంస్థలన్నింటికీ ఓటర్ల జాబితాలను రూపొందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎస్ఈసీ ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాలను తయారు చేయనున్నారు.

2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా (ఋఋఋఅటఎఅఅస్త్ర ఋఖ్వ) ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ తేదీ నాటికి ఓటు హక్కు పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొంది.ఇటీవలే మరో 59 మున్సిపాలిటీలలో ఓటర్ల జాబితాల తయారీకి కూడా ఎస్ఈసీ ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా నోటిఫికేషన్‌తో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగనుందని స్పష్టమవుతోంది.

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది

# గూండాలు దాడి చేశారు

**మొదటి పేజీ తరువాయి**

. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# 5 లక్షల ఇళ్లు మంజూరు

## ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు ,తెలంగాణకు 2 లక్షల ఇళ్లు

**అమరావతి సెప్టెంబర్ 15: (జర్నలిస్ట్ వార్త);**

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది.ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది.ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది.త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు..

**మొదటి పేజీ తరువాయి**

ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి.బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది.మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు.సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

**మొదటి పేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అగా ఖాన్ ఫౌండేషన్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు సీఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.

**మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి**

మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురి కావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ,

## : మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.

"పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు.రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

# (ఏపీపీఎస్సీ) 892 పోస్టుల నోటిఫికేషన్

**మొదటి పేజీ తరువాయి**

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తిగల అభ్యర్థులు నిబంధనలు పరిశీలించి అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

**నోటిఫికేషన్ల ప్రకారం పోస్టుల వివరాలు:**

గ్రూప్-1 సర్వీసులు (163 పోస్టులు): 11 డిప్యూటీ కలెక్టర్లు, 36 డీఎస్పీ (సివిల్), 3డీఎస్పీ (కమ్యూనికేషన్స్), 14 టాక్స్ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్లు, 35 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (ఋఋా), 15 డిప్యూటీ రిజిస్ట్రార్లు, 12 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2, 14 డిస్ట్రిక్ట్/డివిజనల్ ఫైర్ ఆఫీసర్లు, 14 అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ల పోస్టులతో పాటు ఇతర ఉన్నత పోస్టులు ఉన్నాయి.

ఇతర ముఖ్య శాఖల్లో ఖాళీలు: అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు (196), హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 (73), హార్టికల్చర్ ఆఫీసర్లు (37), పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఎనలిస్ట్ గ్రేడ్-2 (18), ఏపీ అసెంబ్లీ రిపోర్టర్లు (11), ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, ఫోరెన్సిక్ సైన్స్ తదితర పోస్టులు భర్తీ కానున్నాయి.

**దరఖాస్తు గడువు .. ముఖ్య సమాచారం:**

గ్రూప్-1 దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 6 నుండి ప్రారంభమై అక్టోబర్ 27 వరకు కొనసాగనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు నిబంధనలు, విద్యార్హతలు, వయోపరిమితికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఞఞఞాజ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకుని గడువులోగా అప్లై చేసుకోవచ్చని బోర్డు తెలిపింది.

# పరస్పర సున్నితత్వం పాటించాలి

**మొదటి పేజీ తరువాయి**

చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది.ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు.మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు.భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

# ఎంఈఓపై అనుచిత ప్రవర్తనను ఖండించిన పీఆర్‌టీయూ

## కార్యాలయంలో నినాదాలు, వాగ్వాదంపై ఆగ్రహం

**కల్లూరు/సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ వార్త):**
వర్క్ అడ్జస్ట్‌మెంట్ అంశంపై కల్లూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో చోటుచేసుకున్న పరిణామాలను పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ తీవ్రంగా ఖండించింది. పాఠశాలల పనివేళల్లో బోధనకు ఆటంకం కలగకుండా చర్చకు నలుగురు సంఘ బాధ్యులు మాత్రమే రావాలని ఎంఈఓ సూచించినప్పటికీ, సుమారు 20 మంది కార్యాలయానికి వచ్చి నినాదాలు, వాగ్వాదానికి దిగడం సరికాదని మండల అధ్యక్షుడు పాకాల రమేష్, కార్యదర్శి చాంద్ సాహెబ్ పేర్కొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఈ నెల 8న జారీ చేసిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులపై వివరణ కోరేందుకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఈ నెల 11న ఎంఈఓ కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. ముందుగా ఉదయం 10.30 గంటలకు నలుగురు బాధ్యులు మాత్రమే రావాలని సూచించినా.. సుమారు 11 గంటలకు దాదాపు 20 మంది వచ్చి తమకు అనుకూలంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని పట్టుబట్టినట్లు పేర్కొన్నారు. నినాదాలు, గట్టిగా






అరుపులతో కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిందని, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారని తెలిపారు.

విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారితో మాట్లాడి, మూడు రోజుల సెలవుల అనంతరం ఈ నెల 17న పూర్తి వివరాలు తెలియజేస్తానని ఎంఈఓ పొదిలి పద్మ చెప్పినప్పటికీ ఆందోళన కొనసాగిందని పీఆర్‌టీయూ నాయకులు తెలిపారు. వాస్తవ పరిస్థితులను నమోదు చేసుకునేందుకు ఎంఈఓ మొబైల్‌లో వాయిస్ రికార్డింగ్ చేస్తుండగా, కొందరు ఆమె అనుమతి లేకుండా ఫోన్ తీసుకుని రికార్డింగ్‌ను తొలగించారని ఆరోపించారు. అనంతరం నినాదాలు చేస్తూ వెళ్లిపోయి, ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద టెంట్ ఏర్పాటు చేసి ధర్నా నిర్వహించారని తెలిపారు.

**మహిళా అధికారితో ఇలా వ్యవహరించడమా?**

మహిళా అధికారితో అనుచితంగా వ్యవహరించడం, విధులకు ఆటంకం కలిగించడం, అధికారిక వ్యవహారాల్లో ఒత్తిడి తీసుకురావడం తగదని పీఆర్‌టీయూ టీఎస్ పేర్కొంది. ఘటనను తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని పాకాల రమేష్, చాంద్ సాహెబ్ కోరారు.

# రెండోసారి మండల ఛాంపియన్‌గా చైతన్య టెక్నో స్కూల్



**సత్తుపల్లి/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** మండల స్థాయి క్రీడా పోటీల్లో సత్తుపల్లి గుడిపాడు రోడ్డులోని చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. సదాశివపాలెం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 18 బహుమతులు సాధించి మండల ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. వరుసగా రెండోసారి ఈ ఘనత సాధించిన ఏకైక ప్రైవేటు పాఠశాలగా నిలిచారు. వివిధ క్రీడా విభాగాల్లో విద్యార్థులు 4 ప్రథమ, 8 ద్వితీయ, 6 తృతీయ స్థానాలు సాధించారు. అలాగే 24 మంది విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాఠశాలలో ప్రత్యేక పీరియడ్లు కేటాయించి, అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ తెలిపారు.

విజయానికి కృషి చేసిన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్. ప్రభాకర్, వి. సురేంద్రలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు ఆర్. సుజాత, ఆర్. రాకేష్, ఎం. రవికుమార్, వై. ఉష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కులాంతర వివాహం చేసుకున్న జంట ఇంటి కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

**కులాంతర వివాహం చేసుకున్న జంట ఇంటి కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి**

**బాధ్యులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి**

**ఆర్ఎస్‌పీ నాయకుడు కుమార్**

**వర్ధన్నపేట/సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ వార్త):**
కులాంతర వివాహం చేసుకున్నారనే కారణంతో ప్రేమజంట నివసిస్తున్న ఇంటిని జేసీబీతో కూల్చివేశారన్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాస్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని రేపల్లె గ్రామానికి చెందిన ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన యువకుడు, బీసీ సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రేమించుకుని కులాంతర వివాహం




చేసుకున్నారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు ఆ జంట నివసిస్తున్న ఇంటిని జేసీబీతో కూల్చివేశారని ఆరోపించారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి వయోజనుడికి తమకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకుని స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించిందని పేర్కొన్నారు. కులం పేరుతో ఇలాంటి దాడులకు పాల్పడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

కులాంతర, ప్రేమ వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం రక్షణ కల్పించి, వారు సమాజంలో గౌరవంగా జీవించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటి కూల్చివేతకు పాల్పడిన వారితో పాటు జేసీబీని అందించిన వారు, ఘటన వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనను అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ ఆశయాలే ఎజెండా యువత ఐక్యతే లక్ష్యం



**ధర్మసాగర్/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు సమక్షంలో గ్రామ యువత, సంఘం సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఏర్పాటు చేశారు.అధ్యక్షుడిగా కే. ప్రణయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి. శ్రీను, కోశాధికారిగా ఎం. ప్రేమ్‌చంద్ ఎన్నికయ్యారు. సభ్యులుగా జి. అక్షయ్, ఎస్. ప్రభాస్, కే. డీమ్ ఫిలాస్, శ్రీవాన్, వరుణ్ తదితరులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు యువతను ఏకం చేస్తామని, గ్రామంలో సామాజిక అసమానతలపై చైతన్యం కల్పిస్తామని తెలిపారు. యువత విద్య, ఉద్యోగ, సామాజిక అభివృద్ధికి అండగా నిలుస్తామన్నారు. గ్రామ యువతలో ఐక్యతను పెంపొందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు.నూతన కమిటీ ఎన్నికపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ సభ్యులకు అభినందనలు తెలిపారు

# దామెర రోడ్డుకు మరమ్మతులు

## మండలవాసుల ఇబ్బందులకు స్పందించిన కాంగ్రెస్ నాయకులు

**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సమీపంలో నీరు నిలిచి అధ్వానంగా మారిన రోడ్డుకు కాంగ్రెస్ నాయకులు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై గుంతలు, బురదతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు



శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో మొరం, కంకర పోసి రోడ్డును చదును చేయించారు.కాజీపేట, దామెర, హనుమకొండ వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. సమస్యపై స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించిన నాయకులకు మండలవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పు మహేందర్, బాపిడ్ సర్పంచ్ రవీందర్ గౌడ్, శ్రీకాంత్, దామెర గ్రామశాఖ ఉపాధ్యక్షుడు కదారి సుధీర్, జడ్సన్ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం పెద్ద చెరువు నీటిని వరి,మెట్ట పంటలకు వెంటనే విడుదల చేయాలి

**-అఖిల భారత రైతు కూలీ సంఘం.**



**బయ్యారం/సెప్టెంబర్ 15(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం పెద్ద చెరువు నీటిని ప్రస్తుతం ఉన్న వరి పంటతో పాటు మెట్ట పంటల సాగుకు వెంటనే విడుదల చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.సంవత్సర ప్రారంభంలో వర్షాలు పడటంతో రైతులు వేసిన వరి పంటలు ప్రస్తుతం చిరు పొట్ట దశకు వచ్చాయని ఆయన తెలిపారు.ఎల్నినో వల్ల చెరువులో నీరు లేక అధికారులు గతంలో నీటిని విడుదల చేయకపోవడంతో కొన్ని పంటలు ఎండిపోగా,మరికొన్ని పంటలను రైతులు బోర్ల ద్వారా కాపాడుకున్నారని పేర్కొన్నారు.ఇటీవల కురిసిన వర్షాలతో ప్రస్తుతం బయ్యారం చెరువు పూర్తి నీటి మట్టానికి చేరుకుందని వివరించారు.కావున, చేతికొచ్చిన వరి పంటను కాపాడేందుకు,అలాగే ఎండిపోయిన పొలాల్లో రెండో పంటగా మెట్ట పంటలు వేసుకునేందుకు జిల్లా కలెక్టర్,రెవెన్యూ,ఐబీ అధికారులు వెంటనే చెరువు నీటిని విడుదల చేయాలని కోరారు.లేనిపక్షంలో చిరు పొట్ట దశలో ఉన్న పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని బయ్యారం మండల కార్యవర్గం తరపున విజ్ఞప్తి చేశారు.

# దేశాభివృద్ధిలో ఇంజనీర్లదే కీలక పాత్ర

## విశ్వేశ్వరయ్య జీవితం యువ ఇంజనీర్లకు దిక్సూచి -వాసవి క్లబ్స్ ఐపీసీ చకిలం రాజేశ్వర్‌రావు



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం నేటి యువ ఇంజనీర్లకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు.ఇంజనీర్స్ డే సందర్భంగా వాసవి క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో చింతగట్టులోని ఎస్సార్ఎస్పీ క్యాంపు వద్ద విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ భారీ ప్రాజెక్టులు, పరిశ్రమలు, రహదారులు, ఆకాశహర్మ్యాలు సహా దేశంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిలో ఇంజనీర్ల కృషి కీలకమన్నారు. విశ్వేశ్వరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువ ఇంజనీర్లు దేశ ప్రగతికి మరింతగా సేవలందించాలని కోరారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగమల్ల మాధవశంకర్, కోశాధికారి అప్పని రమేశ్, మాజీ అధ్యక్షులు వెలగందుల భీష్మనాథం, సంద్రు నాగేందర్, చకిలం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు 1,000.. చేతల్లో సున్నా!

## కళాకారులపై కాంగ్రెస్ కపట ప్రేమ.. ఇనుముల రవీందర్ ఆగ్రహం

**హనుమకొండ/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆటపాటలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన కళాకారుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని తెలంగాణ ఉద్యమ, నిరుద్యోగ కళాకారుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇనుముల రవీందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కళాకారులపై శాసనసభలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కపట ప్రేమను ప్రదర్శిస్తూ సమస్యల పరిష్కారాన్ని సాగదీస్తున్నారని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కళాకారులకు అన్యాయం జరిగిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే వైఖరిని కొనసాగించడం దారుణమన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాల భర్తీకి



వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న కళాకారుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు.

మాటలతో కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని రవీందర్ హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే కళాకారుల సంఘం నాయకులతో చర్చలు జరిపి ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే 33 జిల్లాల కళాకారులను ఏకం చేసి చలో రవీంద్రభారతి చేపడతామని తెలిపారు. అవసరమైతే రవీంద్రభారతి ముట్టడితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వరికోలు రాజేందర్, ప్రధాన కార్యదర్శి జన్ను కుమార్, మట్టెడ కవిత, మధుచారి, నక్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో కోటి భగవద్గీత మహా యజ్ఞం

**కల్లూరు/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ అత్తాపూర్‌లోని ఇస్కాన్ శ్రీరాధాకృష్ణ మందిరంలో జై హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 'కోటి భగవద్గీత మహా యజ్ఞం' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ముంబై ఇస్కాన్ పీఠాధిపతుల ఆశీస్సులతో ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి భగవద్గీత గ్రంథాల ఉచిత పంపిణీని




ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత సకల మానవాళికి సన్మార్గాన్ని చూపే దివ్య గ్రంథమన్నారు. వ్యక్తుల్లో నైతిక విలువలను పెంపొందించి సమాజంలో ధర్మ పరిరక్షణకు గీతాజ్ఞానం దోహదపడుతుందని తెలిపారు. అన్నదానం, వస్త్రదానం కంటే అజ్ఞానాన్ని తొలగించే జ్ఞానదానం గొప్పదని పేర్కొన్నారు.భగవద్గీత ప్రచారం, పంపిణీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు ఆర్థికంగా సహకరించి 'కోటి భగవద్గీత మహా యజ్ఞాన్ని' విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** కమలాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ డిమాండ్ చేశారు. మంగళవారం కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం విద్యార్థుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అజయ్, వినయ్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంతినిలో గౌడ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ఐనవోలు/సెప్టెంబర్ 15(జర్నలిస్ట్ వార్త);** పంతిని గ్రామంలో గౌడ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌడ పెద్దమనుషుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ పెద్దమనుషులుగా మదూరి కుమారస్వామి, బండి రమేష్ గౌడ్‌లను ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా సమ్మెట సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా బండి కుమారస్వామి, కార్యదర్శిగా మదూరి లక్ష్మణ్‌లను ఎంపిక చేశారు. సభ్యులుగా సట్ల సోమన్న, సట్ల అశోక్, బండి వేణు, చిర్ర శ్రీధర్, మదూరి రాజు, చిన్నబత్తిని సమ్మయ్యలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేయడంతోపాటు గ్రామంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని సభ్యులు తెలిపారు.

# మహబూబాబాద్‌లో ఓటర్ల వివరాల సవరణపై కలెక్టర్ పరిశీలన



**మహబూబాబాద్/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ మండలం, పట్టణ పరిధిలోని అమనగల్, బలరాం తండా, 16వ వార్డు, గుమ్మడూరు ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు, షెడ్యూల్ ప్రకారం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో సమస్యలున్న వారికి నోటీసులు అందించినట్లు చెప్పారు. నోటీసులు పొందిన వారు నిర్దేశించిన తేదీల్లో 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదానితో హాజరై తమ వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు. డబుల్ ఓటింగ్‌ను నివారించడం, మృతుల పేర్ల తొలగింపు, చిరునామా మారిన వారి వివరాల సవరణ, కొత్త ఓటర్ల నమోదుతో పారదర్శక ఓటరు జాబితా రూపొందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకా మ్యాపింగ్ చేసుకోని వారు వెంటనే సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటును భద్రపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం




**నర్సంపేట/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** చెన్నారావుపేట మండలం తిమ్మరాయన్‌పహాడ్ అంగన్వాడీ థర్డ్ సెంటర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధా ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ రమేష్ హాజరై చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.
సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పౌష్టికాహార పదార్థాలతో ప్రదర్శన ఏర్పాటు చేసి, వాటిలోని పోషక విలువలను వివరించారు. చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రంలో భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బానోత్ రవి, వార్డు సభ్యులు నాగోతు రజిత, మంద విజయ్, అంగన్వాడీ టీచర్లు అరుణకుమారి, రాజ్యం, ఆశ కార్యకర్త అనిత, ఆయాలు శాంతమ్మ, హస్లీ, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# రోబోటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం




**నర్సంపేట/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16న నిర్వహించనున్న ఒకరోజు రోబోటిక్స్ కార్యశాలకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ పర్యవేక్షణలో, హైదరాబాద్‌కు చెందిన సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సహకారంతో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన ఎంతో అవసరమన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేసేందుకు ఇటువంటి కార్యశాలలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ భైరి సత్యనారాయణ మాట్లాడుతూ 30 మంది విద్యార్థులను ఎంపిక చేసి రోబోటిక్స్ ప్రాథమిక అంశాలు, ప్రయోగాలు, సాంకేతిక అనువర్తనాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో శిక్షణ పొందిన విద్యార్థులు కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ విద్యార్థులతో కలిసి సమీపంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల్లో రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. కొత్తగా శిక్షణ పొందే విద్యార్థులు భవిష్యత్తులో ఇతర విద్యార్థులకు శిక్షణ ఇచ్చే స్థాయికి ఎదిగేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



**తల్లాడ/సెప్టెంబర్ 16 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య, సకల సౌకర్యాలు కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని అన్నారుగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర ప్రసాద్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, మాజీ వీఎస్‌సీ చైర్మన్ మారెళ్ల మల్లికార్జునరావు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, బయ్యారపు శీను, దుద్దుకూరు గోపాల్‌స్వామి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నర్సంపేట అభివృద్ధికి రూ.35 లక్షలు





**నర్సంపేట/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముందుకు సాగుతున్నారని మున్సిపల్ చైర్మన్ పెండం శ్రీలక్ష్మి రామనాథ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.35 లక్షలు మంజూరు చేశారు. మంగళవారం ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం 18వ వార్డు అభివృద్ధికి రూ.35 లక్షలు కేటాయించిన ఎమ్మెల్యేకు వార్డు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభమైన సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా పర్యవేక్షిస్తామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ లక్కర్స్ రమేష్, వార్డు అధ్యక్షుడు బీట్ల మనోహర్, ఉపాధ్యక్షుడు నకినబోయిన మహేష్, కాంగ్రెస్ నాయకులు కందకట్ల వీరేశం, గుంటి అశోక్, యువజన నాయకులు బత్తుల శివకుమార్, బొల్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని చాటాలి

## 17న కేసముద్రంలో భారీ బైక్ ర్యాలీ సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు



**కేసముద్రం/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**
నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలు, భూస్వాముల వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు అన్నారు. మంగళవారం కేసముద్రంలోని సీపీఎం కార్యాలయంలో మార్తినేని పాపారావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రాజు మాట్లాడుతూ.. 194648 మధ్య సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వేలాది మంది రైతులు, కూలీలు, పేద ప్రజలు భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో పోరాటం కీలక పాత్ర పోషించిందన్నారు. పోరాట ఫలితంగా తెలంగాణలో సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నాటి పోరాట స్ఫూర్తితో నేటి తరంలోనూ దోపిడీ, అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా ఈ నెల 17న కేసముద్రం మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న, జల్లే జయరాజు, తాడబోయిన శ్రీశైలం, మోడెం వెంకన్న, కావటి నరసయ్య, సోమారపు ఎల్లయ్య, వేల్పుగొండ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# పిరంగిగడ్డలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సారంగపాణి







**వర్ధన్నపేట/సెప్టెంబరు 15 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మున్సిపాలిటీ 8వ వార్డు పిరంగిగడ్డలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పిరంగిగడ్డ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.
అనంతరం ఉత్సవ ఏర్పాట్లను నిర్వాహకులు, యువతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గణపతి ఉత్సవాలు భక్తిభావంతో పాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయన్నారు. యువత ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరఫున అవసరమైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బక్కతట్ల రాజ్‌కుమార్ యాదవ్, పాలకుర్తి శ్రీకాంత్, పూజారి శ్రీనివాస్, దాసరి బిక్షపతి, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, పిరంగిగడ్డ యూత్ అసోసియేషన్ సభ్యులు, యువకులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆలోచనలే మనిషి అసలు ముఖం

## రూపాన్ని కొలిచే సమాజం.. ఆలోచనలను కొలవడం ఎప్పుడు నేర్చుకుంటుంది?

మనిషిని చూసిన వెంటనే తీర్పు చెప్పడం మన సమాజానికి అలవాటైపోయింది. రంగు ఎలా ఉంది, శరీరాకృతి ఎలా ఉంది, ఎంత ఆస్తి ఉంది, ఏ హోదాలో ఉన్నాడు, ఏ కుటుంబానికి చెందినవాడు అన్నదే చాలాసార్లు మనిషి విలువకు కొలమానంగా మారుతోంది. ఒక వ్యక్తి నిజంగా ఎవరో తెలుసుకోవాలంటే అతని ముఖాన్ని కాదు, అతని ఆలోచనలను చూడాలి. ఎందుకంటే రూపం కనిపించేది బయటకు మాత్రమే. ఆలోచన మాత్రం అతని జీవితాన్ని నడిపిస్తుంది.



ఏ ఆలోచనపై మనసు నిలుస్తుందో దానిపైనే ఆసక్తి పెరుగుతుంది. ఆసక్తి శ్రమను పెంచుతుంది. శ్రమ పట్టుదలను పెంచుతుంది. పట్టుదల ఫలితాన్ని తీసుకొస్తుంది. అందుకే మనిషి రేపు ఎలా ఉండబోతున్నాడో తెలుసుకోవాలంటే అతని ఈరోజు ఆలోచనలను గమనిస్తే సరిపోతుంది. ఆలోచనలు ఒక్కరోజులో తయారుకావు. ఇంట్లో వినిపించే మాటలు, తల్లిదండ్రుల ప్రవర్తన, స్నేహితుల సాంగత్యం, పాఠశాల వాతావరణం, సమాజంలో కనిపించే పరిణామాలు, మీడియా అందించే సమాచారం ఇవన్నీ కలిసి వ్యక్తి ఆలోచనా ప్రపంచాన్ని నిర్మిస్తాయి. ముఖ్యంగా బాల్యంలో ఏర్పడిన భావనలు జీవితాంతం ప్రభావం చూపుతాయి. ఇక్కడే కుటుంబం, విద్యా వ్యవస్థ, సమాజం తమ బాధ్యతను గుర్తించాలి. పిల్లలకు మంచి మార్కులు రావాలని కోరుకోవడం తప్పు కాదు. మార్కుల కోసం విలువలను పక్కన పెడితే ఆ విజయం సమాజానికి ఉపయోగపడుతుందా? ఉద్యోగం కోసం పోటీ పడటం నేర్పుతున్నాం. పోటీలో గెలవడం కంటే మనిషితనం కోల్పోకూడదని చెబుతున్నామా? హక్కుల గురించి మాట్లాడుతున్నాం. బాధ్యతల గురించి ఎంతగా నేర్పుతున్నాం?

విద్య అంటే పుస్తకాల్లోని సమాధానాలను గుర్తుపెట్టుకోవడం మాత్రమే కాదు. సరైన ప్రశ్న అడగడం, తప్పుడు సమాచారాన్ని గుర్తించడం, మంచి చెడులను విశ్లేషించడం, స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడం కూడా విద్యలో భాగమే. ఆలోచించే శక్తిని పెంచని విద్య ఎంత పెద్ద డిగ్రీ ఇచ్చినా అది సంపూర్ణ విద్య కాదు.

యువత విషయంలో సాంగత్యం, పరిసరాల ప్రభావం మరింత ఎక్కువ. మంచి స్నేహం వ్యక్తిని ముందుకు నడిపిస్తుంది. చెడు సాంగత్యం అతన్ని వెనక్కి లాగుతుంది. అందుకే యువతను కేవలం తప్పుపట్టడం పరిష్కారం కాదు. వారికి క్రీడలు, కళలు, నైపుణ్యాలు, ఉపాధి, సామాజిక సేవ వంటి సానుకూల మార్గాలను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకూ సమాజానికీ ఉంది.

ఇక సామాజిక మాధ్యమాల కాలంలో ఆలోచనలకు మరింత అప్రమత్తత అవసరం. మనం చూసే ప్రతి విషయం నిజం కాకపోవచ్చు. మనం పంచే ప్రతి మాట నిరపాయంగా ఉండకపోవచ్చు. ఒక తప్పుడు సమాచారం వందల మందికి చేరవచ్చు. ఒక ద్వేషపూరిత వ్యాఖ్య మరింత ద్వేషాన్ని పెంచవచ్చు. అందుకే స్వేచ్ఛగా మాట్లాడే హక్కుతో పాటు బాధ్యతగా ఆలోచించే సంస్కృతి కూడా పెరగాలి. మనిషిని రంగుతో, రూపంతో, శరీరాకృతితో అంచనా వేయడం వెనుక ఉన్న ఆలోచనను కూడా సమాజం ప్రశ్నించాలి. లావుగా ఉన్నాడా, సన్నగా ఉన్నాడా, తెల్లగా ఉన్నాడా, నల్లగా ఉన్నాడా అన్నది అతని ప్రతిభకు ప్రమాణం కాదు. అతని ఆలోచన ఎంత విశాలంగా ఉంది, ఇతరుల పట్ల అతని వైఖరి ఎలా ఉంది, సమాజం పట్ల అతని బాధ్యత ఎంత ఉంది అన్నదే అసలు కొలమానం కావాలి. ప్రతి తప్పుకూ సమాజాన్నే నిందించడం కూడా సరికాదు. పరిసరాలు ప్రభావితం చేస్తాయి. నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ వ్యక్తికుంది. ఏ ఆలోచనను పెంచుకోవాలి, ఏదాన్ని వదిలేయాలి, ఏ దారిలో నడవాలి అన్నది అతనే నిర్ణయించాలి. అందుకే ప్రతి వ్యక్తి తన ఆలోచనలకు తానే కాపలాదారుగా ఉండాలి. ఇక్కడే అసలు ప్రమాదం ఉంది. ఒక వ్యక్తి చెడు ఆలోచనతో తప్పుదారి పట్టడం ఒక సమస్య. కానీ చెడు ఆలోచనలను సమాజం సాధారణంగా అంగీకరించడం మరింత ప్రమాదకరం. వివక్షను సరదాగా తీసుకోవడం, ద్వేషాన్ని ధైర్యంగా చూడడం, అసహనాన్ని సహజంగా భావించడం మొదలైతే అది ఒక్క వ్యక్తి సమస్యగా ఉండదు. అది సామాజిక సంస్కృతిగా మారుతుంది.

అందుకే మార్పు కోసం ఎవరినో ఎదురు చూడటం కాదు. మన ఇళ్లలో ఏ మాటలు మాట్లాడుతున్నాం, పిల్లల ముందు ఏ ప్రవర్తన చూపిస్తున్నాం, ఎలాంటి స్నేహాలను ప్రోత్సహిస్తున్నాం, ఏ సమాచారాన్ని నమ్ముతున్నాం, ఏ విషయాలకు చప్పట్లు కొడుతున్నాం అన్నది మనమే ప్రశ్నించుకోవాలి. రేపటి సమాజం ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే భవిష్యత్తును ఊహించాల్సిన అవసరం లేదు. ఈరోజు మనం పెంచుతున్న ఆలోచనలను చూస్తే చాలు. మనిషి ముఖం అతని రూపాన్ని చెబుతుంది.

అతని ఆలోచన అతని అసలు స్వరూపాన్ని చెబుతుంది. కాబట్టి ప్రశ్న అతను ఎలా కనిపిస్తున్నాడు అనేది కాదు.

అతను ఎలా ఆలోచిస్తున్నాడు? ఆ ఆలోచన అతన్ని ఎటు నడిపిస్తోంది? సమాజాన్ని ఎటు తీసుకెళ్తోంది? ఈ ప్రశ్నలు మనలో పుట్టినప్పుడే నిజమైన మార్పుకు పునాది పడుతుంది. ఆలోచనను మార్చితే వ్యక్తి మారతాడు. ఆలోచనా సంస్కృతిని మార్చితే సమాజం మారుతుంది. ఆలోచనల్ని మార్చుకోకుండా సమాజం మారాలని కోరుకోవడం మాత్రం అసాధ్యం.



**బిర్రు కరుణాకర్**
**జర్నలిస్ట్ వార్త ఎడిటర్ సి ఈ ఓ**
**సీనియర్ జర్నలిస్ట్ 9701249103**

# హామీలను నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం

**మిర్యాలగూడ/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. గత పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు బయటపడతాయనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకల వాస్తవాలను త్వరలో ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు.



**ప్రతి గణేష్ మండపానికి రూ.5,016 సాయం**

వినాయక చవితి సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి గణేష్ మండపానికి 'బీఎల్ఆర్ బ్రదర్స్' ఆధ్వర్యంలో రూ.5,016 ఆర్థిక సాయం అందిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని పెండింగ్ అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## అమరవీరులకు కొవ్వొత్తులతో ఘన నివాళి



**కేసముద్రం/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):**
వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో అమరవీరులకు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఎంసీపీఐ(యు) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ రైతాంగం వీరోచితంగా పోరాడిందన్నారు. సాయుధ పోరాట చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం సరికాదన్నారు. అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రైతాంగ హక్కుల కోసం జరిగిన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాల చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బొల్లోజు రామ్మోహనచారి, గుగులోతు చిన్నరాజు, దుగ్గిరాల వెంకన్న, కనుకుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక.



**బయ్యారం/సెప్టెంబర్ 15(జర్నలిస్ట్ వార్త):** స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల కంబాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో ఇసులాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మహబూబాబాద్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.వాలు నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10,11 తేదీల్లో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో వివిధ క్రీడల్లో గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికైన వివరాలు వాలీబాల్ జూనియర్స్ జి.రేవంత్, వాలీబాల్ సీనియర్స్ భాను తేజ, సిహెచ్.జంపయ్య, టి.వరుణ్ కబడ్డీ జూనియర్స్ జి.కార్తీక్, పవన్, ఖో-ఖో సీనియర్స్ నిఖిల్, సిహెచ్. సాత్విక్ జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బి.శోభన్ బాబు, పీడీ బి.వాలు నాయక్ మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే జిల్లా స్థాయి పోటీల్లో కూడా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కోదండ సీతారామస్వామి ఆలయానికి సౌండ్ సిస్టమ్ విరాళం.

**బయ్యారం/ సెప్టెంబర్ 15(జర్నలిస్ట్ వార్త);**



వినాయక నవరాత్రులను పురస్కరించుకుని తొవ్వ గ్రామంలోని కోదండ సీతారామచంద్రస్వామి ఆలయానికి సౌండ్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. పెద్దినేని బేబీ-వెంకటేశ్వరావుల పెద్ద కుమార్తె, అల్లుడు అయిన వరగాని ప్రియాంక-నరేష్ దంపతులు ఈ విరాళాన్ని సమర్పించారు. ఉత్సవాల వేళ భక్తి సంకీర్తనలు, పూజా కార్యక్రమాలు భక్తులకు స్పష్టంగా వినబడేందుకు ఇది ఎంతో తోడ్పడుతుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాత తల్లిదండ్రులు బేబీ-వెంకటేశ్వరావులను ఆలయ కమిటీ చైర్మన్ గాదె కృష్ణారెడ్డి, కార్యదర్శి కొల్లా వెంకటేశ్వరరావు శాలువాతో ఘనంగా సత్కరించారు. అర్చకులు సుదర్శనాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతల కుటుంబానికి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ రెడ్డి, మల్లయ్య, బోస్, కోటి, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సర్దుబాట్లు అశాస్త్రీయం

**నిబంధనల మేరకు పునఃసర్దుబాటు చేయాలి: టీఎస్‌యూటీఎఫ్**



**కల్లూరు/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు మండలంలో విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాట్లు అసంబద్ధంగా ఉన్నాయని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిశాన విజయ్‌కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదినారాయణస్వామి, అప్పారావు ఆరోపించారు. విద్యార్థుల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా, ఉపాధ్యాయుల కోణంలో సర్దుబాట్లు చేపట్టారని విమర్శించారు. రాష్ట్ర విద్యాశాఖ నిబంధనలను పాటించకుండా జరిగిన సర్దుబాట్లను రద్దు చేసి, సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించి నిబంధనల ప్రకారం పునఃసర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. తప్పిదాలకు బాధ్యులైన మండల విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ధర్మసాగర్ గ్రామాన్ని అభివృద్ధి దిశ చూపాలి

**ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి**





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామసభలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి తీర్మానాలు చేయాలని తహసీల్దార్ భావ్‌సింగ్, ఎంపీడీవో అనిల్‌కుమార్ సూచించారు. ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఎలియా అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, వ్యవసాయం, ఉపాధి హామీ పనులపై విస్తృతంగా చర్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, నీటి నిల్వలు, పంట కాలువలు, పారిశుధ్యం, మొక్కల పెంపకం, వ్యవసాయానికి ఉపయోగపడే మౌలిక వసతులు వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా నిల్వ చేసుకుని భూగర్భజలాలను పెంచే పనులు చేపట్టాలని సూచించారు. వ్యవసాయం అభివృద్ధి చెందితే రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయని, రైతు కుటుంబాలు బాగుపడితే గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ధర్మసాగర్ ఇకపై వెనుకబడిన ప్రాంతంగా మిగలకుండా అభివృద్ధిలో ముందుండేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి గ్రామసభ ఆమోదంతో తీర్మానాలు చేయాలని నిర్ణయించారు. ఆయా పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత శాఖలకు పంపి పనులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలవాలని మన ఊరు బాగుండాలి. మన రైతు బాగుండాలి. ప్రతి కుటుంబం బాగుండాలి అనే లక్ష్యంతో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ మెంబర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



**ధర్మసాగర్/సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ వార్త):** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ ధర్మసాగర్ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యం ఉందని వారు పేర్కొన్నారు.విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించి, జాతీయ జెండాను ఆవిష్కరించడంతో పాటు తెలంగాణ విమోచన పోరాటంలో పాల్గొన్న వీరుల త్యాగాలను స్మరించుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఈ విషయంపై సానుకూలంగా స్పందించి సెప్టెంబర్ 17న అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని బైరపాక కుమార్ విజ్ఞప్తి చేశారు

# పిఓపి విగ్రహాల తయారీని నిషేధించాలి


**-బయ్యారం మండల పర్యావరణ కార్యకర్తల డిమాండ్.**



**బయ్యారం0సెప్టెంబర్ 15.(జర్నలిస్ట్ వార్త);** పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాల తయారీ,విక్రయాలను తక్షణమే నిషేధించాలని బయ్యారం మండల పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జల వనరులను కలుషితం చేసే పిఓపి విగ్రహాల తయారీకి అసలు అనుమతులు ఎవరు ఇస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు.అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే రసాయనాలు,పూత రంగులతో చేసిన విగ్రహాలు మార్కెట్లోకి వస్తున్నాయని ఆరోపించారు.నిబంధనలు ఉల్లంఘించి పిఓపి విగ్రహాలు తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుని, తయారీ కేంద్రాలను బ్యాన్ చేయాలన్నారు.మండల వ్యాప్తంగా కొత్తపేట,బయ్యారంలో తయారీ విగ్రహాల కేంద్రాలను అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి పిఓపి విగ్రహాల విక్రయాలను అడ్డుకోవాలన్నారు.మట్టి విగ్రహాల వినియోగాన్ని పెంచేలా ప్రజల్లో అవగాహన కల్పించి,స్థానిక మట్టి విగ్రహ కళాకారులను ప్రోత్సహించాలి.నదులు,చెరువులను కాపాడుకోవడానికి అధికారులు ఇప్పటికైనా స్పందించి పిఓపి విగ్రహాల తయారీకి అనుమతులు ఇవ్వడం పూర్తిగా నిలిపివేయాలని మండల పర్యావరణ కార్యకర్తలు కోరుతున్నారు.

# ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం..

## నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు



**హైదరాబాద్: సెప్టెంబర్ 14,(జర్నలిస్ట్ వార్త);** ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది.ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది.మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.

# ‘అలయ్ బలయ్‘కి రండి..

## చంద్రబాబును కలిసి ఆహ్వానించిన దత్తన్న



**హైదరాబాద్: సెప్టెంబర్ 14(జర్నలిస్ట్ వార్త);** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో, అక్టోబర్ 22న నిర్వహించే ప్రతిష్ఠాత్మక ‘అలయ్ బలయ్‘ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని చంద్రబాబును దత్తాత్రేయ ప్రత్యేకంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, ఆత్మీయతను చాటుతున్న ‘అలయ్ బలయ్’ విశిష్టతను చంద్రబాబుకు వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. దత్తాత్రేయ ఆహ్వానం పట్ల చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వేడుకకు తప్పకుండా హాజరవుతానని తెలిపారు. దత్తాత్రేయ మాట్లాడుతూ, “అలయ్-బలయ్ వేదిక తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మరియు సమాజంలోని వివిధ వర్గాల మధ్య సోదరభావాన్ని పెంపొందించే వేదిక“ అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కేవలం ఆహ్వానం మాత్రమే కాకుండా, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సంబంధాల బలోపేతంపైనా ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఉభయ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం, ఉమ్మడి ప్రయోజనాలు, తెలుగు ప్రజల ఐక్యత, పరస్పర సహకారం వంటి కీలక అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి.

# కర్ణాటకలో విషాద ఘటన.. ఫ్రిజ్ పేలి నలుగురు మహిళలు మృతి

**కర్ణాటకలోని బెళగావిలో ఘోర ప్రమాదం**

**రిఫ్రిజిరేటర్ పేలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**

**మరో ఇద్దరికి 60 శాతం కాలిన గాయాలు, పరిస్థితి విషమం**

**ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**బెళగావి : సెప్టెంబర్ 14,(జర్నలిస్ట్ వార్త);** కర్ణాటకలో విషాద ఘటన చోటుచేసుకుంది. బెళగావి జిల్లాలోని ఒక ఇంట్లో రిఫ్రిజిరేటర్ పేలడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బెళగావి నగరంలోని సెంట్రల్ బస్ స్టాండ్ సమీపంలో గల చవత్ గల్లీలో రాజారాం కుటుంబం నివసిస్తోంది. మంగళవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఇంట్లోని రిఫ్రిజిరేటర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. ఈ పేలుడు ధాటికి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో నిద్రిస్తున్న వారిలో నలుగురు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను శారద (50), ఆమె కుమార్తెలు ప్రియ, గంగతో పాటు భారతి అనే మహిళగా గుర్తించారు. వీరంతా మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదంలో రాజారాంతో పాటు రోహన్ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదంలో గాయపడిన వారి శరీరాలు 60 శాతానికి పైగా కాలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను అన్వేషిస్తున్నారు. ఈ విషాద ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, ఆ ఫ్రిజ్ కొత్తదని తెలుస్తోంది.

# రూ.3.93 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్న ఆర్‌బీఐ..

**బ్యాంకింగ్ వ్యవస్థలో అధిక ద్రవ్య లభ్యతను తగ్గించేందుకు ఆర్‌బీఐ చర్యలు**

**వీఆర్‌ఆర్‌ఆర్ వేలం ద్వారా రూ.3.93 లక్షల కోట్లను సమీకరణ**

**ఎఫ్‌సీఎన్‌ఆర్-బీ డిపాజిట్ల కారణంగా వ్యవస్థలో భారీగా పెరిగిన నగదు**

**మనీ మార్కెట్ రేట్లను రెపో రేటుకు అనుగుణంగా ఉంచడమే ప్రధాన లక్ష్యం**





**: సెప్టెంబర్ 14,(జర్నలిస్ట్ వార్త);** బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన అదనపు ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) నియంత్రించేందుకు ఆర్‌బీఐ మరోసారి రంగంలోకి దిగింది. తాజాగా నిర్వహించిన ‘వేరియబుల్ రేట్ రివర్స్ రెపో‘ (వీఆర్‌ఆర్‌ఆర్) వేలం ద్వారా రూ.3,93,352 కోట్లను ఆర్‌బీఐ వెనక్కి తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు నిధులను తగ్గించి, మనీ మార్కెట్ రేట్లను రెపో రేటుకు అనుగుణంగా ఉంచడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది.ఈ వేలం కోసం ఆర్‌బీఐ రూ.5 లక్షల కోట్ల నోటిఫైడ్ మొత్తాన్ని ప్రకటించగా, బ్యాంకుల నుంచి రూ.3,93,352 కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. వచ్చిన బిడ్లన్నింటినీ ఆర్‌బీఐ ఆమోదించింది. ఈ నిధులను 5.24 శాతం కటాఫ్, వెయిటెడ్ యావరేజ్ రేటుతో స్వీకరించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. సెప్టెంబర్ 11 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత సుమారు రూ.10.73 లక్షల కోట్లుగా ఉన్నట్లు అంచనా.

బ్యాంకులు ఇటీవల భారీగా ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్ఆర్-బీ) డిపాజిట్లను సమీకరించడమే ఈ అదనపు నగదుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ డిపాజిట్ల ద్వారా వచ్చిన విదేశీ కరెన్సీని బ్యాంకులు ఆర్‌బీఐతో స్వాప్ చేసుకోవడంతో వాటికి పెద్ద మొత్తంలో రూపాయి ద్రవ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ అదనపు నిధులను నియంత్రించేందుకు గత నెల నుంచి ఆర్‌బీఐ వరుసగా వీఆర్‌ఆర్‌ఆర్ వేలాలను నిర్వహిస్తోంది.వీఆర్‌ఆర్‌ఆర్ వేలంతో పాటు మరో కీలకమైన చర్యను కూడా ఆర్‌బీఐ ప్రకటించింది. అదనపు ద్రవ్యాన్ని మరింత సమర్థంగా నియంత్రించేందుకు ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) కింద రూ.1 లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించనుంది. మూడు విడతల్లో ఈ అమ్మకాలు జరగనున్నాయి. మొదటి విడతలో భాగంగా సెప్టెంబర్ 17న రూ.50,000 కోట్ల విలువైన సెక్యూరిటీలను విక్రయిస్తారు. ఆ తర్వాత సెప్టెంబర్ 21, 28 తేదీల్లో రూ.25,000 కోట్ల చొప్పున రెండు విడతల్లో వేలాలు జరుగుతాయి. ఇదే నెల ఆరంభంలో నిర్వహించిన ఓవర్ నైట్ వీఆర్‌ఆర్‌ఆర్ వేలంలో కూడా ఆర్‌బీఐ రూ.3.53 లక్షల కోట్లకు పైగా నిధులను సమీకరించింది.

# లోకల్ ఫైట్.. జనసేన వ్యూహాం ఏంటి?



**అమరావతి: సెప్టెంబర్ 14,(జర్నలిస్ట్ వార్త);** స్థానిక ఎన్నికల విషయంలో జనసేన పార్టీ వ్యూహం ఆసక్తి రేపుతోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా తాము త్యాగాలు చేయడానికి సిద్ధంగా లేమని, బలం ఉన్న చోట పోటీచేస్తామని కరాఖండీగా చెబుతున్న జనసేన పార్టీ అదే సమయంలో మిత్రపక్షం టీడీపీని ఇరుకున పెట్టేలా ప్రకటనలు చేస్తుండటం వ్యూహంలో భాగమేనా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు బలం ఉందని ఒకవైపు చెబుతూ, మరోవైపు మిత్రపక్షం టీడీపీ తొక్కేస్తుందంటూ ప్రకటనలు చేయడమే అంతుచిక్కడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమిలో టీడీపీ వైఖరిని ప్రశ్నిస్తూ జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అయితే ఎమ్మెల్యే బొలిశెట్టి చేసిన ప్రకటనకు ఆ పార్టీ అధిష్ఠానం కూడా కట్టుబడి ఉన్నట్లు ప్రస్తుత పరిస్థితులు సూచిస్తున్నాయని అంటున్నారు.

కూటమిలో టీడీపీ-జనసేన సంబంధాలపై విస్తృత చర్చ జరుగుతోంది. తాము మరో మూడు సాధారణ ఎన్నికల వరకు కలిసి ఉంటామని ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి నారా లోకేశ్ స్పష్టంగా ప్రకటనలు చేస్తున్నారు. కానీ, ఆయా పార్టీలకు చెందిన నాయకులు మాత్రం భిన్న స్వరాలు వినిపిస్తూనే ఉన్నారు. ఇటీవల ఒంగోలులో మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాస్ మిత్రపక్షం టీడీపీకి చెందిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పై బహిరంగ విమర్శలు చేయగా, కొద్దిరోజుల క్రితం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి ఏకంగా టీడీపీ పార్టీ వైఖరిని నిందిస్తూ చేసిన వ్యాఖ్యలు మరింత వేడిని పెంచాయని అంటున్నారు.

స్థానిక ఎన్నికల సమయంలో ఇటువంటి ప్రకటనలు చేయడాన్ని వ్యూహంలో భాగంగానే చూడాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. జనసేన నేతలు వరుసగా కూటమి ఐక్యతను ప్రభావితం చేసేలా మాట్లాడుతున్నప్పటికీ ఆ పార్టీ హైకమాండ్ కల్పించుకోకపోవడం చూస్తే తమ మనోగతం తెలియజేసేందుకు ఆ పార్టీ ఒక పద్ధతి ప్రకారం ఇటువంటి ఎత్తుగడ ఎంచుకుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో టీడీపీతో సమానంగా ప్రాతినిధ్యం ఉండాలని జనసేన నేతలు కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే పెద్దపార్టీ అయిన టీడీపీతో సమానంగా ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ తమ బలానికి తగినట్లు గౌరవం పెరిగేటట్లు సీట్ల కేటాయింపు ఉండాలని జనసేన కోరుకుంటున్నట్లు చెబుతున్నారు.

రాష్ట్రంలో జనసేనకు ప్రస్తుతం 21 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మొత్తం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను తమ పార్టీకి వదిలేయాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో అదనంగా విజయవాడ, మచిలీపట్నం, ఏలూరు, ఒంగోలు, గుంటూరు కార్పొరేషన్లు జనసేన అడుగుతుందని చెబుతున్నారు. కాకినాడ, తిరుపతి కార్పొరేషన్లలో జనసేన ఎమ్మెల్యేలు ఉండటంతో ఆ స్థానాలు తమకే ఇవ్వాలని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీ నేతలు కంగారు పడుతున్నారని అంటున్నారు. రాష్ట్రంలో దాదాపు 17 కార్పొరేషన్లు ఉండగా, అందులో 8 నుంచి 9 స్థానాలను జనసేన అడుగుతుండటమే పరిస్థితిని వేడెక్కిస్తోందని అంటున్నారు. అయితే ఇదంతా జనసేన వ్యూహాత్మక ఎత్తుగడగా పరిశీలకులు భావిస్తున్నారు. కూటమిలో టీడీపీపై ఈ స్థాయిలో ఒత్తిడి తేకపోతే జనసేనకు రెండు లేదా మూడు స్థానాలతో సరిపెట్టే అవకాశాలు ఉన్నాయని, సగం కార్పొరేషన్లకు కర్చీఫ్ వేస్తే నాలుగో వంతు స్థానాలు అయినా ఇవ్వకపోతారా? అన్నట్లు ఆ పార్టీ ఆలోచనలు ఉన్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు

# మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు



**నిజామాబాద్ : సెప్టెంబర్ 14,(జర్నలిస్ట్ వార్త);** దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా/జ్యోతి) లొంగిపోయారు. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు.

ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (SIB), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు.

ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు.

ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.